క్లుప్తంగా

సర్వమంగళాదేవిగా భ్రమరాంబదేవి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతశివాలయంలో భ్రమరాంబ అమ్మవారు సర్వమంగళాదేవిగా మంగళవారం దర్శనమిచ్చారు. నగరంలోని పురాతన ఆలయం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాత శివాలయం)లో కార్తికమాసం సందర్భంగా జరుగుతున్న నక్తదీక్షా మహోత్సవంలో భాగంగా ఆలయంలో పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ అమ్మవారిని శ్రీ సర్వమంగళాదేవిగా అలంకారం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను ఈఓ నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

హిందీ నాటకాలకు ఎంతో ప్రాధాన్యం

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): డివిజన్‌లో రాజభాష అమలులో హిందీ నాటకాల ప్రాముఖ్యత ఎంతో ఉందని విజయవాడ రైల్వే డీఆర్ఎం, పట్టణ అధికార భాష అమలు కమిటీ చైర్మన్ నరేంద్ర ఏ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని డీఆర్ఎం కార్యాలయంలో 68వ పట్టణ అధికార భాష అమలు కమిటీ సమావేశం జరిగింది. డీఆర్ఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు రోజు వారీ విధుల్లో తప్పనిసరిగా హిందీ ఉపయోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. హిందీ భాష అమలులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధికార భాష డీజీఎం డాక్టర్ శ్యాంసుందర్ సాహూ, అధికార భాష అమలు కమిటీ డెప్యూటీ డైరెక్టర్ అనిర్బన్‌కుమార్ విశ్వాస్, ఎం.కె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వాయిద్య కళాకారుల శిక్షణకు భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించేలా చూడాలని శ్రీదుర్గా మల్లేశ్వర వాయిద్య కళాకారుల సంఘం ప్రతినిధులు కోరారు. భీమన వారి పేటలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ధన్వంతరి జయంతి, శ్రీదుర్గా మల్లేశ్వర వాయిద్య కళాకారుల సంఘం నూతన కార్యవర్గ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులు.. నేతలు ఎంఎస్.బేగ్, అడ్డూరి శ్రీరామ్, భోగవల్లి శ్రీధర్, హనుమత్ దీక్షా పీఠాధిపతి శ్రీదుర్గాప్రసాద్ స్వామి, మైలవరపు దుర్గారావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏపీ దేవాలయాల కేశఖండనశాల నాయీబ్రహ్మణుల సంఘ అధ్యక్షులు గుంటుపల్లి రాందాస్, ద్రాక్షావరపు సూరిబాబు, నవిరి మహేష్, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కూర్మాపు రుక్మాధరరావు, అరసవల్లి శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు రాళ్లపాటి సీతారాములు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మల్లేశ్వరుడికి దీపార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పంచామృత అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన జరిగింది. అనంతరం మల్లేశ్వరస్వామి ఆలయం ఉత్తర భాగంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఆది దంపతులకు దీపార్చన నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అమ్మవారి పంచహారతుల సేవలోనూ, సహస్ర లింగార్చన, దీపార్చనలో పాల్గొన్నారు.

శివకేశవులకు ప్రీతికరం.. కార్తికం

విజయవాడ కల్చరల్: శివ కేశవులకు ప్రీతిపాత్రమైన మాసం కార్తికమని టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అర్చకుడు మురళీకృష్ణస్వామి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన టీటీడీ కల్యాణమండపంలో నిర్వహిస్తున్న కార్తిక మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం కార్తిక మాస వైభవం అంశంగా ప్రసంగించారు. టీటీడీ దేవాలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లలితా రమాదేవి ప్రత్యేక పూజలు చేశారు.

అనధికార పార్కింగ్‌తో పరేషాన్



బస్‌స్టాండ్ డిపార్చర్ బ్లాక్‌లో అనధికారికంగా నిలిపిన వాహనాలు



సిటీ టెర్మినల్‌లో..

- బస్‌స్టాండ్ ఆవరణలో అడ్డదిడ్డంగా నిలుపుతున్న వాహనాలు
- బస్సుల రాకపోకలకు ఇబ్బందులు
- కానరాని అధికారుల చర్యలు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): పండిట్‌నెహ్రూ బస్టాండ్ ప్రాంగణంలో ద్విచక్ర వాహనాల అనధికార పార్కింగ్ ఎక్కువైంది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్‌స్టాండ్ ఆవరణలో వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఉంది. అక్కడ పెడితే డబ్బు కట్టాలని కొందరు వాహనచోదకులు వారి వాహనాలను బస్‌స్టేషన్‌లో ప్లాట్‌ఫాంల వద్ద, సిటీ టెర్మినల్‌లో క్యాంటీన్ల వద్ద ఎక్కడపడితే నిలిపేస్తున్నారు. ఇవి బస్సుల రాకపోకలకు ఆటంకంగా మారుతున్నాయి. వీటి కారణంగా కొన్నిసార్లు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

యథేచ్ఛగా వాహనాల రాకపోకలు

ఎప్పుడు రద్దీగా ఉండే బస్‌స్టాండ్‌లోకి ప్రైవేట్ వాహనాలు యథేచ్ఛగా వెస్తున్నాయి. వీటిని నిలిపేస్తుండటంతో కృష్ణలంక వైపు, సిటీ టెర్మినల్ వద్ద ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. బస్‌స్టాండ్‌లోకి వెళ్లాలన్నా రావాలన్నా చాలా సమయం పడుతోంది.

హల్‌చల్

- సిటీ టెర్మినల్, బస్‌స్టేషన్‌లోని ప్లాట్ ఫాంల వద్దకు నేరుగా ఆటోలు వస్తుండటం, గంటల తరబడి నిలుపుతుండటంతో బస్సు డ్రైవర్లు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.
- బస్‌స్టాండ్‌లోని ఎరైవల్‌బ్లాక్, డిపార్చర్ బ్లాక్‌లో నిత్యం నిలిపే ప్రైవేట్ కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

పట్టించుకునే వారే లేరు

గతంలో ప్రైవేట్ వాహనాలు బస్టాండ్‌లోకి రాకుండా చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి బస్‌స్టాండ్ ప్రాంగణంలో కానరావడం లేదు. దీంతో ప్రైవేట్ వాహనాలు ఇష్టారాజ్యంగా వచ్చేస్తున్నాయి. దీనికి కారణం ఆర్టీసీ అధికారులు పట్టించుకోవపోవడమేనని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

బస్‌స్టాండ్ పార్కింగ్ ప్లేస్‌గా మారింది



ప్రైవేట్ వాహనాలతో బస్‌స్టాండ్ ఒక పార్కింగ్ ప్లేసుగా మారింది. ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలుపుతున్నారు. బస్‌స్టాండ్‌లోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

–తిమోతి, ప్రయాణికుడు

ప్లాట్‌ఫాంల వద్దే వాహనాలు



ప్లాట్‌ఫాంల వద్దే ఆటోలు, ద్వి చక్ర వాహనాలు ఆపుతున్నారు. బస్సులు ఎక్కటం కష్టంగా మారుతోంది. ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది చర్యలు తీసుకుని వాటిని రాకుండా చూడాలి.

–కొండరెడ్డి(ప్రయాణికుడు)

స్వయం సహాయక సంఘాలకు ప్రొఫైలింగ్ యాప్



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ పీవో యూసీడీ డాక్టర్ లత

పటమట(విజయవాడతూర్పు): స్వయం సహాయక బృందాల్లో కచ్చితమైన వివరాల కోసం మెప్మా రూపొందించిన (ఎస్‌హెచ్‌జీ) ప్రొఫైల్ యాప్ అందరూ వినియోగించేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని వీఎంసీ పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ లత అన్నారు. మంగళవారం ఆమె సీతన్న పేటలోని జీఎస్ఆర్ కల్యాణ మండపంలో మెప్మా సిబ్బందికి రిసోర్స్ పర్సన్‌లకు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో 16 వేల స్వయం సహాయక సంఘాల 1,60,000 మంది సభ్యుల సమాచారాన్ని నవీకరణకు మెప్మా కార్యక్రమం చేపట్టిందన్నారు. దశాబ్ద కాలంగా సంఘాల సభ్యుల డేటా నవీకరణ జరగలేదన్నారు. చాలా సంఘాల్లో సభ్యులు మరణించిన వివిధ ప్రాంతాలకు వలస వెళ్లినా, కొంతమంది రెండు మూడు సంఘాల్లో కూడా ఉన్నా.. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణం సక్రమంగా చెల్లించలేక కొన్ని సంఘాలు మధ్యలోనే నిలిచిపోయాయని అలాంటి వాటిని ఇకపై నవీకరించడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఏఎ ప్రొఫైలింగ్ యాప్ ద్వారా సర్వేకు సన్నాహాలు చేస్తుందన్నారు. నెలాఖరులోపు వీఎంసీ పరిధిలోని అన్ని గ్రూపులు, గ్రూపు సభ్యుల వివరాలు లక్ష్యంగా యాప్‌లో పొందుపరచాలని, సంఘాల్లో ఎంతమంది కొనసాగుతున్నారు, ఎంతమంది తొలగిపోయారు, కొత్తగా చేరిన వారిలో బ్యాంకు రుణాలతో ఉపాధి పొందిన వారు, ఎంతమంది వారి సొంత ఇల్లు ఉంది.. ఎంతమందికి లేదనే వివరాలు పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది టెక్నికల్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ ఫణికుమార్, శేఖర్, సుజాత, శ్యామల, సీడీవోలు జగదీశ్వరి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'సాంకేతిక'తో ట్రాఫిక్ సమస్య పరిష్కారం

పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు



ట్రాఫిక్ పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ట్రాఫిక్ పోలీసు అధికారులకు సూచించారు. లైవ్ డ్రోన్ కెమెరాలతో జరుగుతున్న ట్రాఫిక్ క్రమబద్ధీకరణను సీపీ మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించి ట్రాఫిక్ అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. రద్దీ నియంత్రణకు లైవ్ డ్రోన్ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశామని, అక్కడ నుంచి వస్తున్న ఆదేశాలను సిబ్బంది తు.చ. తప్పకుండా పాటిస్తూ ప్రయాణికులకు సహకరించాలని సూచించారు. వాహనచోదకులకు రవాణా సులభతరం చేయడానికి అందుబాటులోని అస్త్రం యాప్, డ్రోన్ కెమెరాలను వినియోగించుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీ ప్రసన్నకుమార్, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ ధ్యానచంద్రకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వీఎంసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు.

సమాన పనికి సమాన వేతనంగా కనీసం రూ.26వేలు ఇవ్వాలని, బుడమేరు వరద ముంపులో పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలకు నెల జీతం బోనస్‌గా అందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. విస్తరిస్తున్న నగరం, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, డ్వాక్రా, సీఎంఈవై కార్మికుల పదవీ విరమణ వయసును పర్మినెంట్ కార్మికుల మాదిరిగానే 62 ఏళ్లకు పెంచాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చినవారిలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్‌వీఎస్ చలం, ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, గౌరవ అధ్యక్షుడు జక్కి జేమ్స్, కోశాధికారి తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్'పై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు



గాంధీహిల్ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఐ ధర్నా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యుత్ ఛార్జీల అంశంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రజలపై విద్యుత్ భారం మోపొద్దని డిమాండ్ చేస్తూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో వన్‌టౌన్ గాంధీహిల్ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలపై ఇటీవల వేసిన రూ.6,072 కోట్ల ట్రూ అప్ భారం ఇంకా అమలులోకి రాక ముందే అంతకు రెట్టింపు భారాన్ని అదనంగా ప్రజలపై మోపడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తాము అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తామని చెప్పి, నేడు ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, సర్దుబాటు చార్జీల బాదుడును ఆపాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలు ఎలా మోపుతుందో వివరిస్తూ కరెంట్ తీగతో ఉరేసుకుని వినూత్న ప్రదర్శన నిర్వహించారు. మొత్తం రూ.17 వేల కోట్ల భారం ప్రజలపై మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, కార్యవర్గ సభ్యులు రమణబాబు, సింగరాజు సాంబశివరావు, కంచర్ల భార్గవ్, పైడికత్తుల రాము, మురుగేషన్ రాము, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగులచవితి



వీరనాగేంద్రస్వామి గుడిలోని పుట్టలో పాలు పోసి పూజలు చేస్తున్న దృశ్యం



సొరంగం కొండపై ఆలయంలో పాలు పోస్తున్న భక్తులు



హెడ్ వాటర్ వర్క్స్‌లోని పుట్టల్లో పాలు పోస్తున్న భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నాగులచవితి వేడుకలు వన్‌టౌన్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి నాగేంద్రస్వామి ఆలయాలు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానాలు, నాగపుట్టలు భక్తులతో కిటకిటలాడాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఆయా ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసి కనిపించాయి. వన్‌టౌన్ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నాగేంద్రస్వామికి తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట సైకంవారి వీధిలోని సత్యనారాయణస్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. 51వ డివిజన్ కొండ ప్రాంతంలోని నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో, వించిపేట రామ్‌గోపాల్ సత్రం ప్రాంగణంలో నాగేంద్రునికి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని తోటకూర దొడ్డి, కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్, కొండ ప్రాంతం, బ్రహ్మంగారి మఠం, సొరంగం కొండ ప్రాంతం, నాగమ్మ సత్రం, పాలప్రాజెక్టు వద్ద రైల్వే ట్రాక్‌ల సమీపంలో పుట్టల వద్దకు తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చారు. చిట్టినగర్ సొరంగం కొండపై భాగంలో వేం చేసిన శ్రీ స్వయంభు శ్రీ వల్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయంలో స్వామి వారికి ఉదయం విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సొరంగం వాటర్ ట్యాంక్ సమీపంలోని ఓం శివ సుబ్రహ్మణ్యేశ్వర సాయి మందిరంలోని పుట్ట వద్ద, భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలోని పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలు పోసేందుకు భక్తులు బారులు తీరారు. ఈవో కె.ఎస్.రామరావు ప్రత్యేక పూజలు చేశారు. ప్రాంగణంలోని పుట్టతో పాటు జంట నాగుల విగ్రహాలకు భక్తులు, ఆలయ సిబ్బంది, అధికారులు కుటుంబ సమేతంగా తరలివచ్చి పాలు, పండ్లు సమర్పించారు. అనంతరం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ ఆవరణలో ఉన్న పుట్ట, హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని పుట్ట, రామరాజ్యనగర్ పరిధిలోని నాగ సాయిబాబా గుడి, విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో కొండపైగల నాగేంద్ర స్వామి ఆలయంలోని పుట్టలో భక్తులు పాలు పోశారు.



చిట్టినగర్ పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



వన్‌టౌన్‌లో పూజలు చేస్తున్న భక్తులు



ఇంద్రకీలాద్రిపై పూజలు చేస్తున్న భక్తులు

సీ ప్లేన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9వ తేదీన భవానీపురం పున్నమిఘాట్ (బబ్బూరి గ్రౌండ్) వద్ద నిర్వహించనున్న సీ ప్లేన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా చేయాలని వీఎంసీ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర అధికారులకు సూచించారు. సీ ప్లేన్ ప్రారంభోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఆయన మారిటైం బోర్డ్ సీఈఓ ప్రవీణ్ ఆదిత్య, సబ్ కలెక్టర్ కె.చైతన్య, ఈవెంట్ ఆర్గనైజర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. నగరంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సీ ప్లేన్ వేడుకలకు సీటింగ్ ఏర్పాట్లు, ప్రవేశ ప్రణాళిక, తాగునీటి సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ జల మార్గంలో విజయవాడ, శ్రీశైలం మధ్య గగన విహారం చేసే ఈ అద్భుతమైన ప్రయోగాన్ని వీక్షించేందుకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన వసతులను ఏర్పాటు చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్ ప్రసాద్, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సర్కిల్–1 జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వరరెడ్డి, జాయింట్ డైరెక్టర్ (అమృత్), పీఓ (యూసీడీ) ఇన్‌చార్జ్ డాక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే బైపాస్ పరిశీలన

పాయకాపురం(విజయవాడరూరల్): నేషనల్ హైవే 16 బైపాస్ రోడ్డును నగర ట్రాఫిక్ డెప్యూటీ పోలీసు కమిషనర్ టి. కృష్ణమూర్తినాయుడు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. గొల్లపూడి నుంచి చినఅవుటుపల్లి వరకు ఉన్న రోడ్డును పరిశీలించారు. రోడ్డు మధ్యలో జరుగుతున్న పనులపై సంబంధిత నేషనల్ హైవే అధికారులను అడిగి తెలుసుకున్నారు. నున్న వద్ద విద్యుత్ టవర్లను ఎత్తు పెంచే పనులపై అడిగారు. త్వరలోనే పెండింగ్‌లో పనులను వేగవంతంగా పూర్తి చేస్తే సంక్రాంతి పండుగ నాటికి రోడ్డుపై రాకపోకలను సాగించవచ్చని తెలిపారు. డీసీపీతో పాటు ట్రాఫిక్ ఏసీపీ టి.రామచంద్రరావు, సీఐ ఎం.సురేష్, నున్న సీఐ పి.కృష్ణమోహన్ ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న నీ తోడు మానసిక కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ ప్రియాంక

మధురానగర్(విజయవాడసెంట్రల్): యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ కె.ప్రియాంక సూచించారు. చుట్టుగుంట అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని యూపీహెచ్‌సీలో మంగళవారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నేరమన్నారు. సరైన అవగాహనతో మాదకద్రవ్యాలను కట్టడి చేయవచ్చని చెప్పారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని ముందుగా గుర్తించి, అవగాహన, కౌన్సిలింగ్, డి అడిక్షన్ సెంటర్లకు పంపించాలన్నారు. నీ తోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఓ నజ్మా మాట్లాడుతూ యువతలో వచ్చే సమస్యలకు అనుభవం కలిగిన సైకియాట్రిస్ట్, సైకాలజిస్టులతో మానసిక వికాసకేంద్రాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షేక్ అయేషా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం సిబ్బంది, ఆశ, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు

బాబా మందిరం అభివృద్ధికి రూ.60 వేలు విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిర్డీసాయిబాబా మందిరం అభివృద్ధికి మంగళవారం దాత ఉప్పలపాటి వెంకట భార్గవ సాయివర్మ రూ.60 వేలు విరాళాన్ని మందిర గౌరవాధ్యక్షుడు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా గౌతం రెడ్డి మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో మందిరాన్ని ఆంధ్రాషిర్డీగా తీర్చిదిద్దామన్నారు. దాత ఉప్పలపాటి వెంకట భార్గవ సాయి వర్మ మాట్లాడుతూ మందిరంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవాకార్యక్రమాలు తనను ఆకట్టుకున్నాయన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి శేషవస్త్రం చిత్రపటంతో దాతను సత్కరించారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్ కోసం తనిఖీలు

పాయకాపురం(విజయవాడరూరల్): సీపీ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు మంగళవారం నున్న పోలీసులు గంజాయిబ్యాచ్ కోసం తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ పరిధి వాంబే కాలనీలో పలు ప్రాంతాల్లో సీఐ పి.కృష్ణమోహన్ సిబ్బందితో మఫ్టీలో వెళ్లి తనిఖీలు చేశారు. డిస్నీల్యాండ్, దేవినేని గాంధీపురం, శాంతినగర్, పరిసర ప్రాంతాల్లో గాలించారు. పీఎస్ పరిధిలో గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ కృష్ణమోహన్ చెప్పారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. తనిఖీల్లో ఎస్ఐ పండుదొర, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషతోనే మనో వికాసం



విజయవాడ కల్చరల్: మాతృభాషతోనే మనో వికాసం కలుగుతుందని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. దామోదర జానపదం, సుశీల్ మీడియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం జానపద గీతాల కార్యక్రమం, మాతృభాషా వికాసం అంశం నిర్వహించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పాలకులుగానీ, పాలితులుగానీ భాషను నిర్లక్ష్యం చెయ్యడం తగదన్నారు. ప్రవాసాంధ్ర కార్డియాలజిస్ట్ శ్రీనివాసరెడ్డి గురించి మాట్లాడుతూ కృష్ణా జిల్లాలోని మారుమూల ప్రాంతంలో జన్మించిన శ్రీనివాసరెడ్డి అమెరికాలో ప్రముఖ వైద్యుడిగా స్థిరపడినట్లు తెలిపారు. అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన పరుచూరి విజయలక్ష్మి, సినీ నిర్మాత దర్శకుడు పసుపులేటి వెంకటరమణ, డాక్టర్ కొండా వేణుగోపాల రెడ్డి, ఇండ్ల రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు. దామోదర జానపదం వ్యవస్థాపకుడు దామోదర గణపతిరావు ఆధ్వర్యంలో జానపద, సినీ గీతాలన ఆలపించారు. డాక్టర్ ఆళ్ల శ్రీనివాస రెడ్డిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.